క్లుప్తంగా

పెద్దింట్లమ్మ, ముసలమ్మతల్లి ఆలయంలో పూజలు


అమ్మవారికి ప్రత్యేక పూజలు చేస్తున్న ఆలయ కమిటీ సభ్యులు

దెందులూరు: కొవ్వలి గ్రామంలో ఉత్తర దిక్కున పొలిమేరలో వేంచేసిన శ్రీ పెద్దింట్లమ్మ అమ్మవారు, శ్రీ కుంటల ముసలమ్మ తల్లి ఆలయంలో ఆదివారం అమ్మవార్లకు భక్తులు పూజలు ప్రదక్షిణలు నిర్వహించారు. అమ్మవారికి నైవేధ్యాలు సమర్పించారు. ఆలయ ధర్మకర్త ఆలపాటి రామకృష్ణ దంపతులు, గొల్లపూడి వెంకటేశ్వరరావు గొల్లపూడి మధు, నిరసి వెంకటరమణ భక్తులు అమ్మవార్లకు ప్రత్యేక అలంకరణ చేసి పూజలు నిర్వహించారు.

శుద్ధీకరణ మాత మహోత్సవం


ఫాదర్ బాలను సన్మానిస్తున్న ఫాదర్లు, సంఘస్తులు

దెందులూరు: శుద్ధికరణమాత ఆశీస్సులు ప్రతి ఒక్కరికి ఉండాలని శుద్ధికరణ మాత స్ఫూర్తితో ప్రతి ఒక్కరు ఆధ్యాత్మిక అభివృద్ధి చెందుతూ ప్రేమ సేవా భావాలతో ఆదర్శవంతంగా జీవించాలని ఆర్‌సీఎం ఏలూరు పీఠం వికార్ జనరల్ డాక్టర్ పి బాల అన్నారు. ఆదివారం దెందులూరు ఆర్‌సీఎం చర్చిలో విచారణ కర్త ఫాదర్ గోడే అమ్మన్ రాజా ఆధ్వర్యంలో శుద్ధీకరణ, మాత మహోత్సవం భక్తిశ్రద్ధలతో జరిగింది. వికార్ జనరల్ డాక్టర్ బాల ను ఫాదర్, అమ్మన్ రాజా, ఫాదర్ కళ్యాణ్ సిస్టర్లు ప్రత్యేక దివ్య పూజ బలి అర్పించారు. అనంతరం ఘనంగా సత్కరించి జ్ఞాపికను అందజేశారు.

రేషన్ సరుకులు సక్రమంగా అందజేయాలి


సమీక్షా సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే ధర్మరాజు

ఉంగుటూరు: రేషన్ సరుకులు ఇకనుంచి డీలర్లు సకాలంలో అందజేయాలని ఉంగుటూరు ఎమ్మెల్యే పత్సమట్ల ధర్మరాజు అన్నారు. ఆదివారం ఎమ్మెల్యే క్యాంపు కార్యాయలం వద్ద రెవెన్యూ, పౌరసరఫరాలు, డీలర్లతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ గత ప్రభుత్వం తెచ్చిన విధానంతో ప్రజలు అనేక ఇబ్బందులు పడ్డారని తెలిపారు. 1వ తేదీ నుంచి రేషన్‌దుకాణాల ప్రారంభానికి సంబంధించిన అన్ని ఏర్పాట్లు చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో గణపవరం తహసీల్దార్ అప్పారావు, నాలుగు మండలాల పౌరసరఫరాల శాఖ అధికారులు, డీలర్లు పాల్గొన్నారు.

ఆలయాల పాలనలో పారదర్శకత ఉండాలి

ఉంగుటూరు : మండలంలోని ఆలయాలు పాలనలో పారదర్శకతగా ఉండాలని ఉంగుటూరు ఎమ్మెల్యే పత్సమట్ల ధర్మరాజు అన్నారు. ఆదివారం దేవదాయ ధర్మదాయ శాఖ అధికార్లుతో సమావేశం జరిపారు. ఆదివారం దేవాలయాలు వివరాలపై అధికారులతో జరిపిన విస్తృత స్థాయి సమీక్షా సమావేశంలో చర్చించడం జరిగింది. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ భక్తులకు సమర్థవంతమైన సేవలు అందజేయాలని అధికార్లను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో దేవదాయ శాఖ జిల్లా కమీషనర్లు, ఇన్‌స్పెక్టర్లు, వివిధ ఆలయాలు ఇవోలు పాల్గొన్నారు.

హామీల అమలులో కూటమి ప్రభుత్వం విఫలం

ఏలూరు (టూటౌన్) : గ్రామీణ ప్రాంతాలలో 3 సెంట్లు, పట్టణ ప్రాంతాలలో 2 సెంట్లు ఇళ్ల స్థలాలు ఇవ్వాలని కోరుతూ జూన్ 2న ఇళ్ల స్థలాల దరఖాస్తుదారులతో జరిగే ధర్నాను జయప్రదం చేయాలని సీపీఐ ఏలూరు జిల్లా కార్యదర్శి మన్నవ కృష్ణ చైతన్య, బీకేఎంయూ జిల్లా అధ్యక్షుడు బండి వెంకటేశ్వరరావు పిలుపునిచ్చారు. స్థానిక సీపీఐ జిల్లా కార్యాలయం స్ఫూర్తి భవనంలో ఆదివారం ఈ ధర్నాకు సంబంధించిన వాల్ పోస్టర్లను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా కృష్ణ చైతన్య మాట్లాడుతూ ఇప్పటికే ఇళ్లు లేని నిరుపేదలు ఇళ్ల స్థలాల కోసం అనేకసార్లు దరఖాస్తులు చేసుకున్నారని, అయినా ప్రభుత్వానికి చీమకుట్టినట్టైనా లేదని మండిపడ్డారు. ఎన్నికల సందర్భంగా కూటమి నాయకులు ఇచ్చిన హామీలు అమలు చేయడంలో ఘోరంగా విఫలం చెందారని విమర్శించారు. తల్లికి వందనం, నిరుద్యోగ భృతి, మహిళలకు ఉచిత బస్సు సౌకర్యంతో పాటు మహిళలకు నెలకు రూ.1500 ఇస్తామన్న వాగ్దానాలు నెరవేర్చకుండా కాల యాపన చేస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. జూన్ 2నఇళ్ల స్థలాల కోసం దరఖాస్తు చేసిన లబ్ధిదారులతో నిర్వహించే ధర్నా కార్యక్రమంలో పెద్ద ఎత్తున పాల్గొని జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు.

కందిపప్పు లేనట్టే!

- జూన్ నెలకూ అలాట్‌మెంట్ ఇవ్వని ప్రభుత్వం
- వరుసగా నాల్గో నెలా పంపిణీకి ఎగనామం
- 6.20 లక్షల మంది కార్డుదారులకు మొండిచేయి
- పేదలపై రూ.16.64 కోట్ల అదనపు భారం

దెందులూరు: కూటమి ప్రభుత్వం పేదల సంక్షేమాన్ని నిర్లక్ష్యం చేస్తోంది. చౌక దుకాణాల ద్వారా అందించే సరుకుల్లోనూ కోత పెడుతోంది. నెలకు కార్డుకు రూ.67తో కిలో కందిపప్పు ఇవ్వాల్సి ఉండగా..ఫిబ్రవరి నుంచి పంపిణీ చేయడం లేదు. జిల్లాకు ప్రస్తుత జూన్ నెలకు సంబంధించిన కందిపప్పు అలాట్‌మెంట్ కూడా ప్రభుత్వం ఇవ్వలేదు. దీంతో ఈనెల కూడా ఎగనామమే అనేది స్పష్టమవుతోంది. కార్డుదారులు బహిరంగ మార్కెట్‌లో కందిపప్పు కిలో రూ.130కొనాల్సి వస్తోంది.

పాత పాటే

కందిపప్పు కొనుగోలుకు సంబంధించి ప్రభుత్వ స్థాయిలో టెండర్ ప్రక్రియ నడుస్తోంది. అధిపూర్తయితే అలాట్‌మెంట్ వస్తుందంటూ నాలుగు నెలలుగా అధికారులు చెబుతున్నారు. దీన్ని బట్టీ పేదల సంక్షేమం విషయంలో ప్రభుత్వం ఎంత నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోందో అర్థంచేసుకోవచ్చు. జిల్లాలో మొత్తం సుమారుగా 6,20,535 రేషన్ కార్డులు ఉన్నాయి.

పేదలపై అదనపు భారం

ప్రభుత్వం చౌక ధరల దుకాణాల ద్వారా కందిపప్పు నాలుగు నెలలుగా పంపిణీ చేయకపోవడంతో జిల్లాలోని పేదలు రూ.16.64కోట్ల అదనపు భారం భరించారు. ప్రభుత్వం రూ.67తో ఇచ్చే కిలో కందిపప్పు నలుగురు లేదా ఐదుగురు ఉన్న ఒక కుటుంబానికి నెలంతా సరిపోతుంది. కానీ మార్కెట్‌లో కిలో రూ.130 ఉంది. ప్రభుత్వం ఇవ్వకపోవడంతో కిలోపై రూ.63 అదనంగా వెచ్చింది మార్కెట్‌లో కొంటున్నారు. జూన్ నెల నుంచి అయినా కందిపప్పు వినియోగం సరఫరాలోకి తీసుకురావాలని ప్రజలు అధికారులు, ప్రజాప్రతినిధులను కోరుతున్నారు.ఈ నెలలో కార్డుదారులకు పూర్తిస్థాయిలో బియ్యం పంచదార మాత్రమే పంపిణీ చేశామని జిల్లా పౌరసరఫరాల శాఖ అధికారులు తెలిపారు.


కందిపప్పు

దెందులూరు నియోజకవర్గంలో రేషన్ కార్డుల వివరాలు

దెందులూరు మండలం	21,600
పెదవేగి మండలం	29,431
పెదపాడు మండలం	21,030
ఏలూరు రూరల్ మండలం	21,400

కందిపప్పు సంగతి ప్రభుత్వం దృష్టిలో ఉందా



మూడు నెలలుగా రేషన్ షాపుల ద్వారా ఇచ్చే కందిపప్పు ఇవ్వటం లేదని ప్రభుత్వం దృష్టిలో ఉందా? అధికారులు ప్రభుత్వం దృష్టిలో తెలియజేశారా లేదా? ఏదైనా ఇబ్బంది ఉంటే ఒక నెల రెండు నెలలు పరిష్కారానికి సమయం చాలటం లేదా? ఉన్న పథకాల్లో ఒక్కొక్కటి పేర్లు మార్చటం చేస్తున్నారు. ఈ రకంగానే నిత్యవసర వస్తువులు కూడా ఇస్తారా ఇవ్వరా?

– అంగడాల సీతారావమ్మ, వైఎస్సార్ సీపీ మహిళా విభాగం దెందులూరు నియోజకవర్గం అధ్యక్షురాలు

కందిపప్పు స్థానంలో నగదు చెల్లించాలి



వినియోగదారులకు రేషన్ కార్డులపై కందిపప్పు ఇవ్వటం లేదు. కందిపప్పు ఇవ్వని ప్రతి నెలకు రేషన్‌కార్డు దారులకు నగదు చెల్లించాలి. కందిపప్పు ఇవ్వక ప్రభుత్వం స్పందించక మౌనంగా ఉండటం సరికాదు.

– కే కృష్ణవేణి, వార్డు మెంబర్ దెందులూరు

2న కొవ్వలిలో విద్యార్థులకు ప్రతిభా పురస్కారాలు

దెందులూరు: కొవ్వలి గ్రామంలో జూన్ 2న యాదవ కమ్యూనిటీ హాల్‌లో సాయంత్రం 5గంటలకు దివంగత ఉపాధ్యాయులు గొరుపర్తి హరికృష్ణ తృతీయ వర్ధంతి సందర్భంగా అమ్మ సోషల్ థాట్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో విద్యార్థులకు ప్రతిభా పురస్కారాలు, వృద్ధులకు ఆర్థిక సాయం అందజేయడం జరుగుతుందని చైర్మన్ కట్టా సత్యనారాయణ తెలిపారు.

నేడు, రేపు విద్యుత్ సరఫరాకు అంతరాయం

పెదవేగి : పెదవేగి మండలం, పెదవేగి సెక్షన్ పరిధిలో ఉన్న 33/11 కేవీ కూచింపూడి సబ్ స్టేషను పరిధిలో ఆర్‌డీఎస్‌ఎస్ పథకం పనుల నిమిత్తం రెండు రోజులపాటు విద్యుత్ అంతరాయం ఏర్పడుతుందని ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ ఆపరేషన్ కేఎం అంబేద్కర్ ఓ ప్రకటనలో తెలిపారు. ఈ నెల 26, 27 సోమవారం, మంగళవారాల్లో ఉదయం 9 గంటల నుండి మధ్యాహ్నం 3 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలుపుదల చేయబడును, అందువల్ల కూచింపూడి సబ్ స్టేషన్ పరిధిలో ఉన్న పరిసర ప్రాంతాలకు విద్యుత్ అంతరాయం ఏర్పడును, కావున వినియోగదారులు గమనించి సహకరించవలసినదిగా అంబేద్కర్ కోరారు.

కొనసాగుతున్న వేసవి విజ్ఞాన తరగతులు


పోతునూరులో విద్యార్థులకు కథలు చెబుతున్న దృశ్యం


భీమడోలులో విద్యార్థులు సామూహిక పుస్తక పఠనం చేస్తున్న దృశ్యం

దెందులూరు: చదవడం, వినటం విద్యార్థులకు ప్రాథమిక స్థాయి నుంచి కీలకమైన అంశం అని పోతునూరు గ్రంథాలయాధికారి రాంబాబు అన్నారు. ఆదివారం వేసవి విజ్ఞాన శిక్షణ తరగతుల్లో భాగంగా పోతునూరు గ్రంథాలయంలో పాఠశాల విద్యార్థులకు చదవటం, వినటం, నిరంతర సాధన క్రమశిక్షణపై సుదీర్ఘంగా అవగాహన కలిగించారు. విద్యార్థులు చిన్ననాటి నుంచి భవిష్యత్తుకు సంబంధించి ఒక లక్ష్యాలను నిర్దేశించుకోవాలన్నారు. ఆ లక్ష్యాలను సాధించేందుకు కృషి చేయాలన్నారు. వేసవి సెలవులను వృథా చేయకుండా క్రమం తప్పకుండా వేసవి విజ్ఞాన శిక్షణ తరగతులకు హాజరైనందుకు పాఠశాల విద్యార్థులను గ్రంథాలయాధికారి రాంబాబు ప్రత్యేకంగా అభినందించారు.

పుస్తక పఠనంతోనే జీవితంలో ఉన్నత స్థానం

భీమడోలు: పుస్తక పఠనంతోనే ఉన్నత స్థితికి చేరుకుంటారని మానవత స్వచ్ఛంద సేవా సంస్థ జిల్లా డైరెక్టర్ తుమ్మల ఉమామహేశ్వరరావు, రాష్ట్ర ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు గ్రహీత మండే సుధాకర్‌లు అన్నారు. భీమడోలు, పూళ్ల, గుండుగొలను శాఖా గ్రంథాలయాల్లో వేసవి విజ్ఞాన శిక్షణ తరగతులు 23వ రోజైన ఆదివారం జరిగాయి. భీమడోలు గ్రంథపాలకుడు కె.శ్రీనివాస్ ఆధ్వర్యంలో రిసోర్స్‌పర్సన్లు టీవీ ఉమామహేశ్వరరావు, మండే సుధాకర్‌లు చెప్పిన నీతి కథలు చిన్నారులు ఆసక్తితో విన్నారు. సామూహిక పుస్తక పఠనం వల్ల కలిగే ప్రయోజనాలను వివరించారు. భరత్ సింగ్, రసల్ వంటి ప్రముఖుల నీతి సూక్తులను వారికి తెలియజేసారు. కేరళలోని ఓ ప్రాంతంలో పుస్తకానికి దేవాలయాన్ని నిర్మించిన విషయాన్ని తెలిపి జ్ఞానోదయంలోనే దైవత్వం ఉందని వారికి చెప్పారు. కష్టేఫలి నీతి కథలు తెలిపారు. అనంతరం వారు మాట్లాడుతూ గ్రంథాలయాలను చిన్నతనం నుంచి వినియోగించుకుని ఉన్నత స్థితి చేరుకుంటారన్నారు. తమ లక్ష్యాల సాధనకు గ్రంథాలయాలు సోపానాలకు నిలుస్తాయన్నారు. వివిధ ఆటలు ఆడారు. ఈ కార్యక్రమాల్లో గ్రంథపాలకులు డీఎస్‌బీ అమర్‌నాథ్, జి.నాగమణి తదితరులు పాల్గొన్నారు.

పౌష్టికాహారంతో సంపూర్ణ ఆరోగ్యం


భీమడోలులో రోగులకు ఉచితంగా భోజనం అందజేస్తున్న డాక్టర్ సునీత, కమిటీ సభ్యులు

భీమడోలు: సామాజిక ఆరోగ్య కేంద్రంలోని ఇన్ పెషెంట్లు రుచి, శుచి గల ఆహారాన్ని అందజేస్తున్నామని భీమడోలు ఆసుపత్రి సూపరిండెంటెంట్ డాక్టర్ సునీత అన్నారు. భీమడోలు సామాజిక ఆరోగ్య కేంద్రంలోని ఇన్‌పెషెంట్లకు ప్రభుత్వం పౌష్టికాహారాన్ని అందజేసే కార్యక్రమాన్ని చేపట్టింది. ఈ కార్యక్రమంలో భాగంగా ఆదివారం రోగులకు ఉచితంగా పోష్టిక విలువ గల ఆహారాన్ని అందించారు. భీమడోలు ఏఎంసీ చైర్మన్ శేషుగిరి, మాజీ ఏఎంసీ చైర్మన్ దూసనపూడి పుల్లయ్యలు రోగులకు భోజనం అందించారు. ఈ సందర్భంగా డాక్టర్ సునీత మాట్లాడుతూ ఆసుపత్రి అభివృద్ధి నిధుల్లో నుంచి రోగులకు ఉచితంగా భోజనం అందిస్తున్నామని, ఆసుపత్రి వచ్చే రోగులకు ఆహారాన్ని బయట నుంచి తీసుకుని వచ్చేందుకు వారి బంధువులు ఇబ్బందులు పడుతున్నారన్నారు. దీనిని దృష్టిలో ఉంచుకుని పరిశుభ్రమైన రుచి గల ఆహారం అందించేందుకు ప్రభుత్వం తగు చర్యలు చేపట్టిందన్నారు. ప్రతి రోజు రోగులకు భోజనాన్ని అందిస్తామని, సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో అభివృద్ధి కమిటీ సభ్యులు ముప్పిరిశెట్టి సుబ్రహ్మణ్యం, యర్రంశెట్టి వాసుబు, పెద్దలు గణ, పైడిమాల యుగంధర్, కుక్కల ప్రసాద్, తాటిమళ్ల రామ్మూర్తి, ఆసుపత్రి సిబ్బంది పాల్గొన్నారు.

దోసపాడు కోర్ జిల్లాకు ఆదర్శం కావాలి


డివిజనల్ కమాండర్ మేజర్‌ను సన్మానిస్తున్న కోర్ ఆఫీసర్లు

దెందులూరు: దోసపాడు సాల్వేషన్ ఆర్మీ ఆధ్యాత్మికంగా జిల్లాకు ఆదర్శం కావాలని సాల్వేషన్ ఆర్మీ ఏలూరు డివిజనల్ కమాండర్ మేజర్ ఏసు రాజు లత అన్నారు. ఏలూరు డివిజనల్ కమాండర్‌గా నియమితులై తొలిసారిగా దోసపాడు కోర్టు విచ్చేసిన డివిజనల్ కమాండర్ దంపతులకు గ్రామంలో అపూర్వ స్వాగతం లభించింది. స్థానిక కోర్ ఆఫీసర్ జోసఫ్ కటాక్షం సంఘ పెద్దలు సంఘస్తులు గృహ సమితి సభ్యులు, యువత, చిన్నారులు ఆధ్వర్యంలో బస్టాండ్ సెంటర్ నుంచి వివిధ రకాల పుష్పాలతో వారిపై చల్లుతూ చర్చి వరకు మేళ తాళాలు క్రైస్తవ గీతాలాపనలతోతీసుకొని వెళ్లారు. అనంతరం చర్చిలో ప్రత్యేక ప్రార్థనలు చేశారు. డివిజనల్ కమాండర్ దంపతులకు ఘన సత్కారం చేశారు. కార్యక్రమంలో కల్యాణ్ రావు, వెంకట్రావు ఆదాము రాజేష్ , జ్ఞాన సుందరం పద్మరాజు కుమార్ ఉన్నారు.

యోగాంధ్రలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలి


కే.శ్రీదేవి, దెందులూరు ఎంపీడీఓ

దెందులూరు: ప్రజా భాగస్వామ్యంతోనే యోగాంధ్ర విజయవంతమవుతుందని దెందులూరు ఎంపీడీవో కే శ్రీదేవి అన్నారు. ఆదివారం దెందులూరు ఎంపీడీఓ కార్యాలయంలో ఆమె మాట్లాడుతూ యోగాంధ్ర కార్యక్రమంలో ప్రతి ఒక్కరు భాగస్వామ్యులు కావాలన్నారు. జూన్ 21వ తేదీన నిర్వహించే అంతర్జాతీయ యోగా దినోత్సవంలో మండల ప్రజలందరూ భాగస్వామ్యం పెద్ద ఎత్తున ఉండాలన్నారు. యోగాంధ్ర విజయవంతం అయ్యేందుకు ఇప్పటికే మాస్టర్ ట్రైనింగ్‌లకు శిక్షణ ఇవ్వడం జరిగిందన్నారు. గ్రామ వార్డు స్థాయిలో ఈ నెల 26 నుంచి 30వ తేదీ వరకు మండల స్థాయిలో జూన్ రెండవ తేదీ నుంచి ఏడో తేదీ వరకు పోటీలు జరుగుతాయన్నారు. రంగవల్లులు పోటీలకు సంబంధించి ఐసీడీఎస్ విద్యార్థులకు విద్యాశాఖ ఆధ్వర్యంలో ఈ విధంగా ఒక్కొక్క రంగంలో పోటీలు నిర్వహణకు ఆయా శాఖల అధికారులను జిల్లా కలెక్టర్ నియమించడం జరిగిందన్నారు. ప్రతిరోజు ఉదయం 7 గంటల నుంచి 8.00 గంటల వరకు యోగ కార్యక్రమాలు విధిగా జరగాలన్నారు. ఇంటర్నేషనల్ యోగాలో పాల్గొనేందుకు లింకు ద్వారా నమోదు కావాలని ఎంపీడీవో సూచించారు. సంపూర్ణ యోగాంధ్ర సాధనకు మేధావులు స్వచ్ఛంద సంస్థలు రిటైర్డ్ ఉద్యోగులు తమ పూర్తి సహాయ సహకారాలు ప్రతి ఒక్కరికి అందజేయాలని ఆమె కోరారు.

మానవత అధ్యక్షుడిగా సత్యనారాయణ

ఉంగుటూరు: ఉంగుటూరు మండల మానవత అధ్యక్షుడు కైకరంకు చెందిన కోనే వీరవెంకట సత్యనారాయణ ఎంపికయ్యారు. మానవత మండల సమావేశం ప్రస్తుతం అధ్యక్షుడు వేగేశ్న రంగరాజు అధ్యక్షతన జరిపారు. సమావేశంలో నూతన కార్యవర్గం ని ఎన్నుకున్నారు. కార్యదర్శిగా రాజాని సతీష్ , కోశాదికారిగా గంజి రవికుమార్ ఉపాధ్యక్షుడిగా దొంతల విజయకుమార్, లను ఎంపిక చేశారు. సమావేశంలో రాష్ట్ర విస్తరణ కమిటీ చైర్మెన్ సాగిరాజు జానిక రామరాజు, రీజియన్ చైర్మెన్ పుప్పాలగోపి, చైర్మెన్ గుణ్ణం బుల్లబ్బాయి, కొండ్రెడ్డి సర్వేశ్వరరావు, శీతాల సత్యనారాయణ, పుసులూరి ప్రకాష్, గురువెల్లి రాజారావు, పాతూరి వంశీ, పుత్సకాయల విష్ణు, కోనే సత్యనారాయణ ,రాజీని సతీష్ తాతారావు, సూర్యనారాయణరాజు, తాడిగడప వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.

సహజ వనరులను దోచేందుకే ఆపరేషన్ కగార్


మావోయిస్టులతో చర్చించాలని నినాదాలు చేస్తున్న సీపీఐ ఎంఎల్ ప్రజాపంథా నాయకులు

కుక్కునూరు: ఛత్తీస్‌గఢ్ రాష్ట్రంలోని కర్రెగుట్టల్లో ఉన్న సహజ వనరులను స్వదేశీ, విదేశీ కార్పొరేట్ పెట్టుబడిదారీ సంస్థలకు కట్టబెట్టేందుకే ఆపరేషన్ కగార్ చేపట్టినట్టు సీపీఐ ఎంఎల్ ప్రజాపంథా జిల్లా నాయకులు సిరికొండ రామారావు, గడ్డాల ముత్యాలరావు ఆరోపించారు. సీపీఐ ఎంఎల్ ప్రజాపంథా మండల ముఖ్య కార్యకర్తల సమావేశం జంగారెడ్డిగూడెం డివిజన్ కార్యదర్శి సోయం చంద్రావు అధ్యక్షతన ఆదివారం మారేడుబాక గ్రామంలో నిర్వహించారు. సమావేశంలో జిల్లా నాయకులు మాట్లాడుతూ ప్రధాని నరేంద్ర మోదీ, రక్షణ శాఖ మంత్రి అమిత్‌షా తీసుకొచ్చిన ఆపరేషన్ కగార్‌తో ఆదివాసీ గిరిజన ప్రజలు 500 మంది మృతి చెందారని, 100 మంది వరకు మావోయిస్టులు మృతి చెందారన్నారు. ఒరిస్సాలో అనారోగ్య సమస్యలతో చికిత్స పొందుతున్న నంబాల కేశవరావును పట్టుకొని బూటకపు ఎన్‌కౌంటర్ చేశారని ఆరోపించారు. వెంటనే ఆపరేషన్ కగార్‌ను నిలిపివేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో పార్టీ జిల్లా నాయకులు కట్టం వీరాస్వామి, పోలవరం డివిజన్ కార్యదర్శి కట్టా ముత్యాలరావు, కుక్కునూరు మండల కార్యదర్శి కంగాల కల్లయ్య, జంగారెడ్డిగూడెం కార్యదర్శి పెరుమాళ్ల శ్రీను, మిరియాల సుజాత, కవులూరి సీత, మడివి మహేష్, గొప్ప ధర్మయ్య, తదితరులు పాల్గొన్నారు.

దెందులూరు ఇన్‌చార్జి ఎంఈఓగా నరసింహమూర్తి


నరసింహమూర్తి

దెందులూరు: దెందులూరు మండల ఇన్‌చార్జి ఎంఈఓగా సబ్బిత నరసింహమూర్తిని నియమిస్తూ జిల్లా కలెక్టర్ వెట్రి సెల్వి ఆదేశాలు జారీ చేశారు. దెందులూరు ఎంఈఓ 1గా ఉన్న ఏవీఎస్‌వీ ప్రసాద్ మెడికల్ లీవ్‌లో ఉండటంతో ఎట్టకేలకు పెదపాడు ఎంఈఓగా పని చేస్తున్న నరసింహమూర్తిని దెందులూరు మండల ఇన్‌చార్జి ఎంఈఓగా నియమించారు.

పేకాట, కోడిపందాల స్థావరంపై పోలీసుల దాడి

పెదవేగి : పేకాట కోడిపందేల స్థావరంపై దాడి చేసిన పోలీసులు పదిమంది పందెం రాయుళ్లను అదుపులోకి తీసుకున్నారు. పెదవేగి ఎస్సై కె రామకృష్ణ తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. పెదవేగి మండలంలోని కూచింపూడి గ్రామంలో ఆదివారం రాత్రి గ్రామ శివారులలో పేకాట శిబిరం నిర్వహిస్తున్నారన్న సమాచారంతో ఎస్ఐ రామకృష్ణ తన సిబ్బందితో దాడి చేశారు. ఈ మేరకు సంఘటనా స్థలంలో పదిమంది పేకాట రాయుళ్లతో పాటు రూ. 3500 నగదు రెండు కోళ్లు, రెండు కత్తులు స్వాధీనం చేసుకున్నారు. వీరిని పోలీస్ స్టేషన్‌కు తరలించారు.

పేకాట శిబిరంపై దాడి

నిడమర్రు: మండలంలోని అడవికొలను గ్రామంలో పేకాట ఆడుతున్నట్లు సమాచారంమేరకు ఆదివారం రాత్రి పేకాట శిబిరంపై నిడమర్రు పోలీసులు దాడి చేసి 4గురు వ్యక్తులను అదుపులో తీసకున్నట్లు ఎస్సై వీన ప్రసాద్ తెలిపారు. వీరి నుంచి 2,100 నగదు స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేసామన్నారు.

హెచ్ఐవీ బాధితులకు పౌష్టికాహారం అందజేత


చిన్నారులకు పౌష్టికాహారం కిట్లు అందజేస్తున్న స్వచ్ఛ భారత్ వాకర్స్ సభ్యులు

ఏలూరు (టూటౌన్): స్వచ్ఛ భారత్ వాకర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఏలూరు, వంగాయగూడెం యాపిల్ కేర్ అండ్ సపోర్ట్ సెంటర్ లో ఉన్న హెచ్ఐవి పిల్లలకు ఆదివారం పౌష్టికాహారం అందించారు. ఈ కార్యక్రమానికి అధ్యక్షత వహించిన వైఎస్ కనకారావు మాట్లాడుతూ గత పది సంవత్సరాలుగా ఈ సంస్థలో ఉన్న పిల్లలకు పౌష్టికాహారం, ప్రోటీన్ ఫుడ్ అందిస్తున్నామని తెలిపారు. హెచ్ఐవీ బాధితులు మనోధైర్యంతో జీవించాలని, మంచి ఆహారం తీసుకుంటూ డాక్టర్ల సలహా మేరకు మందులు వాడటం ద్వారా జీవితకాలాన్ని మరింత పెంచుకోవచ్చని అన్నారు. ఖర్జూరం, అటుకులు, బెల్లం, వేరుశెనగగుళ్లు, రాగి పిండి ఇతర పౌష్టికాహారం కలిగిన కిట్లను హెచ్ఐవీ బాధితులకు స్వచ్ఛభారత్ వాకర్స్ అసోసియేషన్ సభ్యులు అందించారు. ఈ కార్యక్రమంలో గౌరవ అధ్యక్షుడు మధ్యాహ్నం వెంకటేశ్వరరావు, కట్టా ఈశ్వర రావు, చిదరపోయిన శ్రీనివాసరావు, అధ్యక్ష, కార్యదర్శులు కల్లూరు చంద్రశేఖర్, చేకూరు వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

మజ్జిగ పంపిణీ

ఏలూరు రూరల్: సత్రంపాడు వాకర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో సత్రంపాడులోని ఎన్టీఆర్ విగ్రహం ఆదివారం మజ్జిగ పంపిణీ చేశారు. పాదచారులు, వాహనచోదకులకు మజ్జిగ అందజేసారు. కార్యక్రమంలో అసోసియేషన్ అధ్యక్షులు ప్రసాద్, గౌరవ అధ్యక్షులు కోటేశ్వరరావు, ఉపాధ్యక్షుడు శ్రీనివాసరావు, వీవీ సత్యనారాయణ పాల్గొన్నారు.

చికిత్స పొందుతూ వివాహిత మృతి

జంగారెడ్డిగూడెం: మనస్థాపానికి గురై ఆత్మహత్యకు పాల్పడిన మహిళ చికిత్స పొందుతూ మృతి చెందింది. దీనికి సంబంధించి ఎస్సై షేక్ జబీర్ తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. జీలుగుమిల్లి మండలం ములగలంపల్లికి చెందిన రమాదేవికి, వేగవరం గ్రామానికి చెందిన కప్పల మంగరాజుతో 8 నెలల క్రితం వివాహమైంది. మంగరాజు మందబుద్ధి ఉండడంతో తనకు తింగరివాడిని ఇచ్చి పెళ్లి చేశారంటూ రమాదేవి మానసికంగా బాధపడుతోంది. ఈ క్రమంలో 13న వేగవరంలోని ఇంటి వద్ద పురుగు మందు తాగింది. గమనించిన కుటుంబ సభ్యులు వెంటనే జంగారెడ్డిగూడెం ఏరియా ఆసుపత్రికి, అక్కడి నుంచి మెరుగైన వైద్యం నిమిత్తం ఏలూరు, విజయవాడకు తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ 24న మృతి చెందినట్లు ఆసుపత్రి నుంచి సమాచారం వచ్చింది. దీనిపై మృతురాలి తండ్రి గారపాటి మంగరాజు ఇచ్చిన ఫిర్యాదుతో కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.

సచివాలయాల కుదింపు

గణపవరం: ప్రజల ముంగిటకే పరిపాలన అందించేందుకు గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వం తీసుకువచ్చిన గ్రామ సచివాలయ వ్యవస్థ స్వరూపాన్ని మార్చివేయడానికి కూటమి ప్రభుత్వం నిర్ణయించింది. ఇందులో భాగంగా గ్రామ సచివాలయాలను కుదించి, క్లస్టర్ వ్యవస్థను తెరమీదికి తెచ్చింది. గణపవరం మండలంలోని 20 గ్రామ సచివాలయాలను పది క్లస్టర్లుగా విభజించడానికి అధికారులు ఏర్పాట్లు పూర్తిచేశారు. గణపవరం–1, గణపవరం–2 సచివాలయాలు ఒక క్లస్టర్‌గా, గణపవరం–3, గణపవరం–4 సచివాలయాలు రెండో క్లస్టర్‌గా ఏర్పాటు చేశారు. ఏ.గోపవరం, అర్ధవరం సచివాలయాలను 3వ క్లస్టర్‌గా, ఎస్.కొండేపాడు, అప్పన పేట సచివాలయాలను 4వ క్లస్టర్‌గా, చిలకంపాడు, కాశిపాడు సచివాలయాలను 5వ క్లస్టర్‌గా, ముప్పర్తిపాడు, కేశవరం సచివాలయాలను 6వ క్లస్టర్‌గా, మొయ్యేరు, కోమర్రు సచివాలయాలను 7వ క్లస్టర్‌గా, వల్లూరు, జల్లికొమ్మర గ్రామ సచివాలయాలను 8వ క్లస్టర్‌గా, పిప్పర–1, పిప్పర–2 సచివాలయాలను 9వ క్లస్టర్‌గా, కొత్తపల్లి, సరిపల్లె సచివాలయాలను 10వ క్లస్టర్‌గాను మండల పరిషత్ అధికారులు విభజించారు. దీంతో మండలంలో విధులు నిర్వహిస్తున్న దాదాపు 50మంది సచివాలయాల ఉద్యోగులను ఈక్లస్టర్‌లలో వివిధ హోదాలలో సర్దుబాటు చేయాల్సి ఉంది.

'తొలకరి'కి ముందే వర్షాలు


బుట్టాయగూడెంలో కురుస్తున్న వర్షం

- సాధారణంగా జూన్ రెండో వారంలో రుతుపవనాలు
- ఈ సారి మే నెలాఖరులోనే ప్రవేశిస్తాయని వెల్లడించిన వాతావరణశాఖ
- ఏజెన్సీ ప్రాంతంలో ప్రతి రోజూ పలు గ్రామాల్లో కురుస్తున్న వర్షాలు

బుట్టాయగూడెం: ఆశల నైరుతి ముందస్తుగానే ప్రవేశించే అవకాశం ఉందని వాతావరణ శాఖ తీపి కబురు చెబుతుంది. సాధారణంగా జూన్ రెండో వారంతో కేరళను తాకే రుతుపవనాలు ఈ సారి ముందస్తుగానే ఈ నెల 26వ తేదీనే రుతుపవనాలు తాకనున్నాయని వాతావరణ శాఖ ప్రకటించింది. అయితే రోహిణీ కార్తె ప్రారంభానికి ముందు నుంచే జిల్లాతో పాటు మన్యం ప్రాంతాన్ని వరుణుడు పలకరించాడు. మండు వేసవిలో నిండుగా కమ్ముకొచ్చిన కారు మబ్బులతో గిరిజన ప్రాతంలో విస్తారంగా వర్షాలు కురుస్తూనే ఉన్నాయి. గత వారం రోజుల నుంచి ఉదయం, సాయంత్రం ఉరుములు, మెరుపులతో వర్షాలు కురుస్తున్నాయి. సాధారణంగా జూన్ రెండో వారం దాటిన తర్వాత తొలకరి జల్లులు పలకరిస్తాయి. అయితే అకాల వర్షాలు, తుఫాన్లతో మరింత ముందుగా వానలు కురుస్తుండడంతో తొలకరి ముందుగానే వచ్చిందని రైతులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. ఏడాది వచ్చే వానాకాలం ఖరీఫ్ సీజన్‌పై రైతులు ఎన్నో ఆశలు పెట్టుకున్నారు. ముందుగా కురుస్తున్న వానలతో పలు చోట్ల రైతులు దుక్కులను కూడా సిద్ధం చేసుకున్నారు. గత కొద్ది రోజులుగా కురుస్తున్న వర్షాలతో భూమి మరింత నానిందని రైతులు అంటున్నారు.

విచిత్ర వాతావరణం

రోహిణీ కార్తెలో ఎండలు రోళ్లే పగులుతాయని నానుడి. సూర్య భగవానుడు రోహిణి నక్షత్రంలో ఉన్న సమయంలో రోజు రోజుకూ వేడి పెరుగుతుంది. ఆ సమయంలో తీవ్రమైన ఎండలు కాస్తాయి. అయితే ఈ ఏడాది రోహిణి కార్తె ప్రారంభమైనా అకాల వర్షం కారణంగా వాతావరణం చల్లగానే ఉంది. 8 రోజులు ముందుగానే రుతు పవనాలు కేరళను తాకడంతో ఎండల తీవ్రత ఉండే పరిస్థితి లేనట్లే కనిపిస్తుంది. మరో రెండు రోజుల్లో తెలుగు రాష్ట్రాల్లోకి రుతు పవనాలు ప్రవేశిస్తాయని వాతావరణ శాఖ ప్రకటించడంతో ఎండల ప్రభావం ఉండకపోవచ్చని పలువురు భావిస్తున్నారు. ప్రస్తుతం అకాల వర్షాలతో వాతావరణం చల్లబడడంతో తీవ్రమైన ఉక్కబోత సమస్య నుంచి అందరూ ఉపశమనం పొందుతున్నారు.